క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై



ఎల్కతుర్తి: భీమదేవపల్లి మండలం ముల్కనూర్ ఎస్సైగా సాయిబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై మహేందర్ మామునూర్‌కు బదిలీపై వెళ్లగా ధర్మసాగర్ పీఎస్ నుంచి బదిలీపై వచ్చిన సాయిబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సైకు పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

సదుపాయాలు కల్పించాలి



పరకాల: ప్రభుత్వ పాఠశాలలకు కావాల్సిన భవనాలు, మౌళిక సదుపాయాలలను ప్రభుత్వం వెంటనే కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. గతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల భవనాలు శిధిలావస్థలో ఉండడంతో అధికారులు కూల్చివేసినట్లు తెలిపారు. కాని మళ్లీ నూతన భవనాలు నిర్మించలేదని అన్నారు. వెంటనే నూతన భవనాలు నిర్మించాలని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పరకాల మండల అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, సాయి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

దామెర: వర్షాలు సంవృద్ధిగా కురుస్తున్న తరుణంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వినియోగదారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఈ గుర్రం రమేష్ సోమవారం ప్రకటనలో సూచించారు. విద్యుత్ స్తంభాలు, పరికరాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, స్టాటర్లను తడి చేతులతో తాకడం ప్రమాదకరమని వెల్లడించారు. విద్యుత్ తీగలకు చెట్టు కొమ్మలు తగలడం లేదా స్తంభాలు ఒకవైపుకు ఒరిగినట్లు కనిపిస్తే వెంటనే విద్యుత్ అధికారులుకు, సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు.

కమిటీ నియామకం



కమలాపూర్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల కమిటీని నియమించినట్లు ఫోరం జిల్లా అధ్యక్షుడు భాష బోయిన రవీందర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా నరిగె ఓదేలు, ప్రధాన కార్యదిర్శిగా జేరిపోతుల రమేష్, ఉపాధ్యక్షుడిగా పబ్బు రాజేందర్‌లను నియమించినట్లు అయన తెలిపారు.

అర్హులను గుర్తించాలి

పరకాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం ఎమ్మెల్యే అనుచరులకే కేటాయిస్తున్నారని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొజ్జ హేమంత్ మాదిగ మంగళవారం ప్రకటనలో ఆరోపించారు. అర్హులైన నిరుపేద దళితులను గుర్తించి దళితబంధు యూనిట్ కేటాయించాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని సూచించారు. దళిత బంధు, డబుల్ బెడ్రూం ఇస్తామని రాష్ట్ర చెబుతూ మభ్యపెడుతుందని విమర్శించారు.

కేయూలో కాంట్రాక్టు లెక్చరర్ల ధర్నా

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ (కుక్టా) ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తూ మంగళవారం క్యాంపస్‌లోని పరిపాలనా భవనం వద్ద కాంట్రాక్టు లెక్చరర్లు ధర్నా చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్‌యూనివర్సిటీస్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోధ్, కో చైర్మన్ జరుపుల చందులాల్, కేయూ జనరల్ సెక్రటరీ ఆర్‌డి ప్రసాద్, బాధ్యులు నాగయ్య, సంగీత్‌కుమార్, రఘువర్ధన్‌రెడ్డి, శ్రీధర్‌రావు, బ్రహ్మయ్య, వెంకటేష్, సుధీర్, తరుణ్, రమణబాబు, మధుకర్ రావు, చీకటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెయిన్‌కోట్‌ల పంపిణీ



హసన్‌పర్తి : నగరంలోని 1వ డివిజన్ ముచ్చర్లలో విధులు నిర్వహించిన పారిశుధ్య కార్మికులకు మంగళవారం రెయిన్ కోట్‌లు పంపిణీ చేశారు. స్థానికుడు చల్లా మోహన్‌రెడ్డి భార్య పూలమ్మ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు చల్లా కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, స్థానికులు శ్రీధర్, పాల్, చిత్ర రాజేష్, శ్రవణ్, సతీష్‌చారి, రమేష్, బాబు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మొండివైఖరి వీడాలి



పరకాల: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు



కమలాపూర్: ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు



ఐనవోలు: భిక్షాటన చేస్తున్న జీపీ ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది



ధర్మసాగర్‌లో నిరసన తెలుపుతున్న గ్రామపంచాయతీ సిబ్బంది

పరకాల: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని గ్రామ పంచాయితీ ఉద్యోగుల, కార్మికుల జేఏసీ మండల అధ్యక్షుడు కొరె సంతోష్ స్పష్టం చేశారు. పంచాయతీ కార్మికులపై ప్రభుత్వం మొండి వైఖరిని వీడాలని కోరారు. పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారంతో 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జేఏసీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పోలీసుల జోక్యంతో క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ నాగరాజుకు వినతిపత్రం అందించారు. అనంతరం సంతోష్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించడంతో పాటు ట్రెజరీ ద్వారానే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, కార్మికులను పర్మనెంట్ చేయడంతో పాటు పీఆర్సీలో నిర్ణయించిన రూ.19వేల వేతన చెల్లించాలని అన్నారు. కాంట్రాక్టర్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 13 రోజుల నుంచి సమ్మె చేస్తున్న ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని విమర్శించారు. వెంటనే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఆనందరావు, మండల ఉపాధ్యక్షుడు సిలువేరు జగ్జీవన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి కిరణ్, కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని గ్రామ పంచాయతీ కార్మికులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని కోరారు. మండల కేంద్రంలోని రైతు సదస్సులో పాల్గొనేందుకు వెళ్తున్న కౌశిక్‌రెడ్డిని జీపీ కార్మికులు కలిశారు. డిమాండ్ల సాధన కోసం 13 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను, డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా స్పందించిన కౌశిక్‌రెడ్డి పంచాయతీ కార్మికుల డిమాండ్లను సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు ఈసంపెల్లి ఐలయ్య, జిల్లా నాయకుడు మాట్ల భాస్కర్, సీపీఐ మండల కార్యదర్శి నకీర్త ఓదెలు, సీపీఐ నాయకులు, పంచాయతీ కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మసాగర్: గ్రామ పంచాయతీ కార్మికులు, సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ యూనియన్ మండల అధ్యక్షుడు చల్లా మహేందర్‌రెడ్డి పభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం స్పందించి జీఓ 51 సవరించాలని, మల్టీ పర్పస్ విధానాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, గ్రాట్యూటీ, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కారోబార్లను, బిల్ కలెక్టర్లు సహాయ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు వెంకటస్వామి, రాపర్తి శ్రీకాంత్, మహ్మద్ వాజిద్, వెల్దండి రమేష్, కుసుమ రాజేష్, సంగాల సరోజన, గడ్డం అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు: జీపీ ఉద్యోగ కార్మికుల సమ్మెలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులు డప్పుచప్పుళ్లతో ప్రధాన రహదారిపై భిక్షాటన చేపట్టిన వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జీపీ ఉద్యోగ కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కనీస వేతన అమలు, ప్రమాద బీమాతో పాటు ఇతర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ మండల అధ్యక్షుడు కొత్తూరి ఏసోబు, నాయకులు కొండేటి రవి, గబ్బెట యాకయ్య, సురేందర్, రంజిత్, మల్లేశ్, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

దామెర: డిమాండ్ల పరిష్కారనికి 12 రోజుల నుంచి గ్రామపంచాయతీ సిబ్బంది సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో గ్రామాల్లో పంచాయతీ కార్మికులు అందిచాల్సిన సేవలు నిలిచిపోయాయి. చెత్త సేకరణ, తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గ్రామంలో మంగళవారం నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ అనిల్ వీధుల్లో ఉండే గేట్‌వాళ్లను తిప్పుతూ నీటిని విడుదల చేశారు. అలాగే తాత్కాలిక కూలీలను ఏర్పాటు చేసి చెత్తా, చెదారాన్ని తొలగించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

మా ఊరిలో కంపెనీ పెట్టొద్దు

● బయోఫ్యూయెల్ కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గ్రామసభ తీర్మానం



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ యాదగిరి

ఆత్మకూరు: మండలంలోని కటాక్షపూర్‌లో ఓరుగల్లు బయోఫ్యూయెల్ కంపెనీ ఏర్పాటు చేయాలని అధికారులు ఇటీవల ప్రతిపాదనలు పంపించిన విషయం తెలిసిందే. కాగా మంగళవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించగా ప్రజలు వ్యతిరేకించారు. మా ఊరిలో ఎలాంటి కంపెనీ పెట్టొద్దని, దాంతో తమ ప్రాణాలకు హాని కలుగుతుందని తెలిపారు. కటాక్షపూర్ గ్రామంలో సర్పంచ్ మచ్చిక యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేసి కంపెనీ ఏర్పాటుపై సమీక్షించగా కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేకిస్తున్నట్లు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ప్రజలకు ఇష్టం లేకుండా అధికారులు కంపెనీకి అనుమతులు ఇవ్వొద్దని తెలిపారు. ఆల్కాహాల్ కంపెనీ కావడం వలన విషపూరిత వాయువులు వెలువడి ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశాలు ఉన్నాయని, అందుచేతనే కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేకిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు సర్పంచ్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సృజన, ఉపసర్పంచ్ ఒన్నాల సాంబయ్య, వార్డుసభ్యులు కుడుతల రమేష్, బత్తిని భాగ్యం, మారపల్లి సూర్యకుమారి, భిక్షపతి, దామరకొండ కవిత, భూక్య అరుణ, కొమ్మిడి మోహన్‌రెడ్డి, బాసిడి మహేందర్, గఫూర్, సిరంశెట్టి సుమన్, రాజునాయక్, నరేష్, సర్దార్, రాజన్న, శ్రీధర్, వెంకటేష్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడి సేవలో భజన మండలి సభ్యులు



స్వామి సేవకు హాజరైన శ్రీ బాలాజీ భజన మండలి బృందం సభ్యులు

కమలాపూర్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శ్రీరాముని జన్మ నక్షత్రం పునర్వసు నక్షత్రం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సేవా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీరాముని సేవకు మండలంలోని గుండేడు గ్రామానికి చెందిన శ్రీ బాలాజీ భజన మండలి సభ్యులు విష్ణుదాసు, మహీధర్‌రావులు ఎంపిక అయ్యారు. ఈ మేరకు భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు దేవాలయం ప్రాంగణంలో సుప్రభాత భజన, గిరి ప్రదక్షణ, పూలమాల సమర్పణ, సంకీర్తనలు, శ్రీరామ కోటి, సహస్రనామాల ప్రతులను సమర్పించి సీతారామచంద్రస్వామి అభిషేక మహోత్సవంలో భజన మండలి సభ్యులు పాల్గొన్నారు. అనంతరం శ్రీ శృంగేరి జగద్గురు పాదాల చెంత, అంబ సత్రంలో శ్రీ సీతారామచంద్రుని కళ్యాణ మహోత్సవంలో భజన నిర్వహించారు. రాష్ట్ర శాఖ అధ్యక్షులు సిద్ధేశ్వర్, జనగామ జిల్లా కోశాధికారి లక్ష్మయ్య, మాందాటి రాజు, సంజీవ్, గణేష్, రాజేందర్, శ్రీనివాస్, అజయ్, రమేష్, లక్ష్మణ్, విజయ్, శంకర్‌రావు, అజయ్, రాఘవులు, నరేష్, పాల్గొన్నారు.

పనులు ప్రారంభించిన సర్పంచ్



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

ధర్మసాగర్(వేలేరు): మండలంలోని వేలేరు గ్రామంలోని ప్రధాన రహదారి వెడల్పు పనులను మంగళవారం స్థానిక సర్పంచ్ కాయిత మాదవరెడ్డి ప్రారంభించారు. రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా గ్రామంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లను, గోడలను జేసీబీ సహాయంతో తొలగించారు. ఉప సర్పంచ్ సద్దాం హుస్సేన్, పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు ఉన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న హరీశ్‌రెడ్డి

ఎల్కతుర్తి: విద్యార్థులు కష్టంతో పాటు ఇష్టపడి చదివినప్పుడే ఉన్నత స్థాయికి చేరుకుంటారని మానసిక నిపుణుడు హరీష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆల్టీట్యూడ్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు మైండ్ పవర్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో ఉన్నత చదువులతోనే వివిధ రంగాల్లో రాణించవచ్చని అన్నారు. ప్రతీ విద్యార్థి వ్యక్తిత్వం, మానసిక ప్రశాంతతను అలవర్చుకోవాలన్నారు. జీవితంలో విజయం సాధించాలంటే కచ్చితమైన ప్రణాళికను ఎంచుకొని పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. చెడు స్నేహానికి దూరంగా ఉండాలని, తల్లిదండ్రుల కష్టాలను గుర్తుంచుకోవాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ కార్తీక్‌రావు, పీఈటీ తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దామెర: చిరు వ్యాపారంలో నష్టాలు రావడంతో మనోవేదనకు గురైన వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని వంగపహాడ్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన వివరాలు ప్రకారం. గ్రామానికి చెందిన నన్నబోయిన కుమారస్వామి (30) పాల వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా ఇతనికి సుమారు 9 ఏళ్ల క్రితం దామెర మండల కేంద్రానికి చెందిన మమతతో వివాహం జరిగింది. రాజేందర్ పాల వ్యాపారం చేస్తూ నష్టాల బారిన పడ్డాడు. అప్పటి నుంచి చేసిన అప్పులు ఎలా తీర్చాలనే మనోవేదనకు లోనయ్యేవాడు. దీంతో పాటు గత కొద్ది రోజుల క్రితం మమత పిల్లలతో కలిసి తన పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 10వ తేదీన పుట్టింటిలో తన భార్య వద్దకు వెళ్లి అప్పుల విషయమై చర్చించాడు. ఎలాగైనా అప్పులు తీర్చుదామని భార్య ఓదార్చినప్పటికీ మనస్థాపం చెందిన రాజేందర్ తనతో పాటు తెచ్చుకున్న గడ్డి మందును తాగాడు. వెంటనే గమనించిన భార్య 108 వాహనంలో ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుని తల్లి సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. కాగా మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తెలిపారు.

ఎస్సీ కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం



సమస్యలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఆత్మకూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామని గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి ఎస్సీ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. కాలనీలో రోడ్లు వేయలేదని అంతా బురదమయంగా మారాయని ఎంపీడీఓకు స్థానికులు తెలిపారు. బురద కాకుండా వెంటనే మొరం పోయిస్తామని ఆయన తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. ప్లాస్టిక్ పాత్రల్లో నీటిని నిల్వ ఉంచకూడదని సూచించారు. పంచాయతీ కార్యదర్శి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సీజ్ చేయాలి

హసన్‌పర్తి : భీమారం శివారులో ప్రభుత్వ అనుమతి లేకుండా కొనసాగుతున్న సైక్ పాఠశాలను సీజ్ చేయాలని యూఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం యూఎస్ఎఫ్ఐ సభ్యులు మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోతు రాజేశ్‌నాయక్ మాట్లాడుతూ సైక్ పాఠశాల పేరిట అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాలను కొనసాగించే ప్రయత్నాలు చేస్తున్నారని వారు ఆరోపించారు. విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూళ్లు చేసేందుకు ఆ పాఠశాల యాజమాన్యం పూనుకుందని ఆరోపించారు. వెంటనే పాఠశాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ హన్మకొండ టౌన్ కార్యదర్శి హరీష్, నాయకులు రాకేష్, మహేష్, శ్రీనివాస్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పరకాల: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ ఓటమి, బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని లలిత కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం బీజేపీ సద్దుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు తమ వెంట తెచ్చుకున్న సద్దులను భుజించారు. అనంతరం ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కార్యకర్తలు ప్రజలకు చేరువ కావాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, గుజ్జ సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు దేవు సాంబయ్య, దేవునూరి మేఘనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్, కొండి జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎర్ర రామన్న, జిల్లా ఉపాధ్యక్షులు గురుజాల శ్రీరామ్‌రెడ్డి, ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, కౌన్సిలర్ కొలనుపాక భద్రయ్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తండాలో ఘనంగా తీజ్ పండుగ



తీజ్ ఉత్సవాల్లో మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు, యువతులు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముస్తఫాపూర్ గ్రామ పంచాయతీలోని మక్తానాయక్ తండాలో గిరిజనులు తీజ్ (సీత్లా భవాని) పండుగను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఆషాఢమాసం ముగింపు, అధిక శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా గిరిజన మహిళలు డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు, యువతులు మొక్కులు చెల్లించారు. అనంతరం ఆటలు ఆడుతూ పాటలు పాడారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, పిల్లా పాపలతో కుటుంబ సభ్యులమంతా సుఖ సంతోషాలతో జీవించేలా చూడుతల్లి అంటూ సీత్లా భవాని అమ్మవారిని వేడుకున్నారు.

బహుజన విద్యార్థి గర్జనను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

హన్మకొండ : హనుమకొండలో ఈనెల 20న జరిగే బహుజన విద్యార్థి గర్జనను విజయవంతం చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొట్ల కార్తీక్, వరంగల్ రీజనల్ సెక్రటరీ కన్నం సునీల్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద బహుజన విద్యార్థి గర్జన కరపత్రాలను విడుదల చేశారన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం ఉదయం 10 గంటలకు హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో బహుజన విద్యార్థి గర్జన మహాసభ జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. సభకు అన్ని వర్గాల ప్రజలు భారీ తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో బీఎస్పీ పార్టీ అచరించే అంశాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, దళితులకు జరుగుతున్న అన్యాయాలపై ఆర్ఎస్పీ మాట్లాడుతారని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో బీఎస్పీ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు శనిగరపు రాజు, మంద శ్యామ్, నాయకులు తాళ్లపెల్లి వెంకటస్వామి, జన్ను భరత్, దరిగి ధనరాజ్, కిరణ్, రామంచ శ్రీను, కందుకూరి యువకిషోర్, వేల్పుల శంకర్, మామిండ్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన వ్యక్తి అరెస్ట్

వరంగల్ క్రైం : హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఎస్ఆర్ గార్డెన్ వద్ద ఎక్సైజ్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఉద్యోగి చంద్రమౌళి భూమికి సంబంధించిన నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన జంగ్లీ ప్రభాకర్‌ను అరెస్ట చేసి రిమాండ్‌కు తరలించినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ ఎస్.కరుణాకర్ తెలిపారు. దీంతో పాటు మరికొందరి భూములకు సంబంధించిన నకిలీ డాక్యుమెంట్లను తయారు చేసి ప్రభాకర్ విక్రయించినట్లు ఆయన తెలిపారు. చంద్రమౌళిపై బెదిరింపులకు పాల్పడిన సంఘటనలో ఆయన ఫిర్యాదు మేరకు ప్రభాకర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

తగాదాలు లేకుండా పరిష్కరించుకోవాలి



వెంకటాపూర్‌లో విచారణ చేపడుతున్న డీసీపీ కరుణాకర్

దామెర: భూ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఈస్ట్ జోన్ డీసీపీ పుల్లా కరుణాకర్ సూచించారు. మండలంలోని వెంకటాపూర్‌లో సదాశివుడు, సింగరాజుపల్లిలో వడ్డెపల్లి రాజేందర్‌ల మధ్య తలెత్తిన భూ వివాదంపై డీసీపీ సోమవారం విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా క్షేత్ర స్థాయిలో ఆయన పర్యటించి వివరాలు సేకరించి మాట్లాడారు. ఇరు వర్గాలు భూమికి సంబంధించిన పత్రాలతో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. భూ తగాదాల్లో ఎలాంటి హింసాత్మక కార్యక్రమాలకు తావు లేదని, సంయవనం పాటించి సమస్య పరిష్కారం చేసుకోవాలన్నారు. ఆయన వెంట సీఐ శ్రీనివాసరావు, ఎస్సై ముత్యం రాజేందర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఏసీపీ శ్రీనివాస్‌కు వీడ్కోలు

వరంగల్ క్రైం : కాజీపేట ఏసీపీగా పనిచేసి హైదరాబాద్ మాదాపూర్ ఏసీపీగా బదిలీపై వెళ్లిన పి.శ్రీనివాస్ కాజీపేట సబ్ డివిజన్ పోలీసులు సోమవారం రాత్రి ఆత్మీయ వీడ్కోలు పలికారు. హనుమకొండలో జరిగిన వీడ్కోలు సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ బారీ మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల మన్ననలతో పాటు ఉన్నతాధికారుల మన్ననలు పొందిన వ్యక్తి శ్రీనివాస్ అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ తనతో పనిచేసిన అధికారుల పూర్తి సహకారం వల్ల తాను ఉద్యోగంలో అందరి మన్ననలు పొందినట్లు తెలిపారు. ఎక్కడ సర్వీస్ చేసిన పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావడానికే పూర్తిస్థాయిలో పని చేస్తామని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఐపీఎస్ అధికారి అంకిత్, ఏఆర్ అదనపు డీసీపీ సంజీవ్, ఏసీపీలు కిరణ్, బోనాల కిషన్, దేవేందర్‌రెడ్డి, తిరుమల్, డేవిడ్‌రాజ్, సతీష్‌బాబు, ఇన్‌స్పెక్టర్లు పుల్యాల కిషన్, షకుర్, ప్రవీణ్, పోలీస్‌శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.